# అనాథ బాలుడు

నేను గదిలోకి వెళ్ళాను. గదిలోనుంచి పారిపోవాలని పించింది. బడిలోనుంచి పారిపోవాలనిపించింది. ఎక్కడికి? ఎవ్వరూ కనిపించనిచోటుకీ, ఎవ్వరికీ కనపడని చోటుకీ పారిపోవా లనిపించింది. మా అమ్మ వుంటే ఆమెను కావిలించుకొని ఏడ్చేవాణ్ణి. మొన్న వాళ్ళ బాబ్బయికి ఏడుపువస్తే వాళ్ల అమ్మ ఒళ్లోకి తలదూర్చి, చీరె తడిసేదాకా ఏడవలా? అట్లా ఏడ్చేవాణ్ణి. నాకు అమ్మ లేదు, ఎవరికి చెప్పుకొని ఏడ్వను?

అంతలో నాతో ఆ బళ్లో చదువుకొనే పిల్లలు, రాముడూ, భీముడూ ఒచ్చారు. 'ఎందుకురా దొరగారు అడిగితే చెప్పలేదు' అన్నాడురాముడు. 'దొరగారికే ఎదురు తిరిగావు. ఇక్కడనుంచి వెళ్ళగొడితే తిండిలేక మాడి చస్తావు' అన్నాడు భీముడు. 'పోలీసువాళ్ళు బొక్కలోకి తోస్తారు' అన్నాడు రాముడు.

నేను అట్లాగే నుంచున్నాను. నేను చేసినపని తప్పేనేమో! ఎందుకు చేశానో నాకే తెలియదు. దొరగారు అడిగిందానికి జవాబు చెపితే ఏంపోయింది? ఎన్నిసార్లు వారు అడగలేదు! ఎన్నిసార్లు నేను చెప్పలేదు. కాని ఈసారి నాకెందుకో జవాబు చెప్పబుద్ధి పుట్టలేదు. దొరగారికి కోపం వచ్చిందంటే వస్తుంది మరి!

జరిగిన సంగతంతా ఒక్కసారి జ్ఞాపకానికి వచ్చింది నాకు. ఆపుకుందామనుకున్నా ఆగకుండా కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. ఈ లోకంలో అనేకమంది పిల్లలున్నారు. వాళ్లకులేని కష్టం నాకెందుకు వచ్చింది? ఈబళ్లో నాకు మల్లే తల్లీ తండ్రీ లేనివాళ్లు అనేకమంది చదువుకుంటున్నారు. వాళ్ళెవ్వరూ నాకుమల్లే యాతనపడుతున్నవాళ్లు లేరు. వాళ్లు నవ్వుతూ కేకలుపెడుతూ ఆడుకుంటూనే వుంటారు. నాకు మాత్రం ఆడుకోబుద్ధి అవదు. వాళ్ళతో కలిసి వుండబుద్ధి అవదు కూడాను.

నేను ఒక పల్లెటూళ్ళో పుట్టాను. అమ్మా, అయ్యా తప్ప నాకు తెలిసినంతవరకు, మాకు చుట్టాలెవ్వరూ ఆ వూళ్ళో లేరు, మా అయ్య ఎక్కడనుంచో బతకటానికి ఆ వూరు వచ్చాడట. మా అయ్య కూలిచేసుకుంటూ వుండే వాడు. ఎక్కువగా రాళ్ళుకొట్టే పనికి వెళ్ళేవాడు. ఆ రాళ్ళు కొట్టే పనిమీద ఒకమేస్త్రీ వుండేవాడు. ఆ మేస్త్రీ అప్పు డప్పుడూ మా ఇంటికి వచ్చిపోయేవాడు. ఆయనకు మాఅమ్మ అంటే ఎక్కువ ఇష్టం. ఇల్లు జరగనప్పుడు ఆయన డబ్బు కూడా ఇస్తూ వుండేవాడు. ఆ మేస్త్రీ మా ఇంటికి రావటం మా అయ్యకు గిట్టేదికాదు.

ఒకరోజు ఆ మేస్త్రీ ఆయన మా ఇంటికి వచ్చాడు. మా అమ్మా ఆయనా చాలాసేపు మాట్లాడుకుంటూ కూర్చు న్నారు. అవ్వాళ ఏం జరిగిందో ఏమో, మా అమ్మ ఏడుస్తూ ఆయనకు ఏమేమో చెప్పింది. ఆయన మా అమ్మను ఓదా ర్చాడు. వెళ్లేటప్పుడు కొద్దిగా డబ్బిచ్చి వెళ్ళాడు. ఆ రాత్రి

ఎనిమిది గంటలకు మా అయ్య ఇంటికి వచ్చాడు. అది మామూలే. అట్లా వచ్చి అమ్మతో కజ్జా పెట్టుకొని కొడుతూ వుంటటంకూడా మామూలే.

వచ్చి రావటంతోనే, "వాడు వచ్చాడటే ఇక్కడికి?" అని అడిగాడు.

అయ్య ఎవ్వర్ని గురించి అడుగుతున్నాడో అమ్మకు తెలుసు. "వచ్చాడు" అంది అమ్మ.

"వాడితో ఏమేమి చెప్పావ్?" అని అడిగాడు అయ్య.

"చెప్పటానికి ఏముంది? నీకోసమే వచ్చాడు. నిన్నడిగాడు. లేడన్నాను, వెళ్ళిపోయాడు" అంది అమ్మ.

"అబద్ధాలు ఆడతావటే నాతో? నిన్ను కట్టుకుంది వాడా, నేనా?" అని మీదపడి కొట్టాడు అమ్మని. గొంతు పట్టుకొని నులిమాడు. అమ్మ కుక్కిమంచంమీద అట్లాగే ఒరిగింది. చూరులోవున్న కొడవలి లాక్కొని "ఇవ్వాళ వాడి పని తేలుస్తా" అని బయటకు వెళ్ళిపోయాడు ఆయన.

నేను అమ్మమీదపడి ఏడ్చాను. "అమ్మా, అమ్మా" అని పిలిచాను. ఇంకెక్కడి అమ్మ? అమ్మ నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయింది.

నా ఏడుపులకు ఇంటి చుట్టుపక్కలవాళ్లు పోగయ్యారు. అమ్మని చూశారు. అయ్యని నానా బండబూతులూ కూశారు.

తెల్లవారి మాఇంటికి పోలీసులు వచ్చారు. మాఅయ్య ఆరాత్రే మేస్త్రీనికూడా చంపి ఎక్కడికో పరారయిపోయాడని

పొరుగువాళ్ళు వాళ్ళల్లో వాళ్ళు చెప్పుకుంటే విన్నాను. మా యిల్లు సోదా చేసి పోలీసులు వెళ్ళిపోయారు. నాసంగతి ఆలోచించిన వాళ్ళు లేరు. నే నేం చెయ్యాలి ? ఒక పొరుగమ్మ నన్ను చూచి జాలిపడి వాళ్ళఇంటికి తీసుకువెళ్ళి నాలుగు మెతుకులు పెట్టింది. నాలుగురోజులు ఆ అమ్మ ఇంట్లోనే తిని, అక్కడే పడుకున్నాను. నాలుగోరోజు సాయంకాలం వూరికి మైలుదూరంలో వున్న బావిలో మా అయ్య శవం దొరికిందని తెలిసింది. కొందరు పెళ్ళాన్ని చంపి, మేస్త్రీని చంపి, పోలీసులకు భయపడి భావిలోపడి చచ్చిపోయాడని అన్నారు; మరి కొంతమంది పోలీసులనుచూచి పారిపోతుంటేవాళ్ళే కాల్చి చంపి తమమీదకు రాకుండా బావిలో పడేశారని అన్నారు.

నన్ను చూచి జాలిపడిన ఆ అమ్మకు నేను తిప్పనిసరి అయ్యాను. ఆ అమ్మకు అయిదుగురు సంతానం. అందులో ఒకపిల్లవాడికి నాకూపడేదికాదు. నన్నుఎప్పుడూ ఏదో ఒకటి అంటూ వుండేవాడు. మా అమ్మనిగురించి నీచపుమాటలు అనేవాడు. కొద్దిరోజులు ఏమన్నా నేను మెదలకుండా వూరుకునే వాణ్ణి. కాని ఒకరోజు ఎదురుతిరిగాను. ఇద్దరం కొట్టుకున్నాం. నాకే ఎక్కువ దెబ్బలు తగిలినై. వాడు మాత్రం ఏడుస్తూవెళ్ళి వాళ్ళ అమ్మకుచెప్పుకున్నాడు. అమ్మకు కోపం వచ్చింది. "తేరగా తిని కొవ్వి కొడతావ్రా నాకొడుకుని" అని నన్ను చితకకొట్టింది. నేను ఎవ్వరితో చెప్పుకోను ? అతనికి అమ్మవుంది-చెప్పుకున్నాడు. వాళ్ళమ్మ కొడుకునికొట్టాననే కోపంకొద్దీ నన్ను చితకకొట్టింది. నేను ఎవరితో చెప్పుకోను ? నాకు అమ్మలేదు.

నాకు ఆ ఇంట్లోనుంచి పారిపోవా లనిపించింది. రెండు రోజులు కాలవకట్టలూ, గుట్టలూ, చేలూ పట్టుకొని తిరిగాను. అయ్య పడిచచ్చిపోయిన బావిదగ్గరకు వెళ్ళాను. దాని గట్టు మీద కూర్చున్నాను. లోపలకు తొంగిచూశాను. భయం వేసింది. ఆరాత్రి చీకటిపడి ఇంటికి వెళ్ళాను.

గడపలోనే ఆ యమ్మ కనిపించింది. ఎముకలు విరిగి నయ్యే అనుకున్నాను. కాని ఆ యమ్మ ఏమీజరగనట్టుగానే, "పాతకుండలో నీళ్ళు కాగివున్నాయి. తోడుకుని పోసుకురా. అన్నం తిందువుగాని" అంది.

నా చెవులను నేనే నమ్మలేనంత విచిత్రంగా ఆమెను చూశాను.

"అట్లా చూస్తావేం ? వెళ్ళు !" అంది.

ఆరోజునుంచి ఆయమ్మ నన్ను ఒక్కమాట అనలేదు. మా పోట్లాటల్లో కొడుకునే మందలించేదికాని, నన్నేమీ అనేదికాదు. ఏమంటే ఏం చేసుకుంటానో-అని దుడుకుపడ్డట్టు వుంది. ఈ పాపానికి నే నెందుకు పడిగట్టాలి-అని అనుకున్నట్టుంది. మరునాడు ఈ మాటలే పొరుగింటి ఆబిడతో చెప్తుంటే నేను విన్నాను. కోపం వచ్చినప్పుడు తడి తగిలించినా ఆయమ్మ మంచిదే. మంచిదికాకపోతే అసలు నావంటివాణ్ణి ఎందుకు దగ్గరకు జేరుస్తుంది ? ఊళ్ళో ఎవ్వారికీ పట్టంది తా నెందుకు పట్టించుకుంటుంది ?

కాని, నన్నేం చెయ్యాలా-అనే విషయం ఆమెను ఎప్పుడూ పీడిస్తూనే వుండేది.

3540



ఆ యమ్మకు ఒక చుట్టం వుంది. ఆమె పట్టణంలో పంతులమ్మ పని చేస్తూ వుంది. అవ్వాళ ఆమె వచ్చింది. ఆవిడా ఆ యమ్మా ఏం మాట్లాడుకున్నారో!

"రేపు పట్టణం వెళ్దాం వస్తావా, అబ్బాయి?" అని అడిగిందా పంతులమ్మ.

"వస్తాను" అన్నాను. ఎక్కడైతే నాకేం? ఇక్కడ నాకు వున్నదేమిటి; అక్కడ లేనిదేమిటి?

"అక్కడ బళ్ళో జేరిపిస్తాను. చదువుకుందువుగాని" అన్నది.

తల్లీ తండ్రీ లేనివాళ్ళకి—అంటే దిక్కులేని వాళ్ళకి ఆ పట్టణంలో బడివుందనీ, వారు అక్కడే అన్నంపెట్టి చదువు చెపుతారనీ చెప్పింది. అయితే ముందు కొద్దిగా డబ్బుకట్టాలని చెప్పింది. ఒక ఏభైరూపాయీలు ఆ యమ్మ ఇస్తే, తనొక ఏభైరూపాయలు ఇచ్చి ఆబళ్ళో చేర్పిస్తానన్నది. తరువాత చదువుకున్నన్ని రోజులూ అన్నానికీ బట్టకీ గానీ, చదువుకు గానీ ఏమీ కట్టవలసిన పని లేదని, అన్నీ వాళ్ళే చూచుకుంటారనీ చెప్పింది.

ఎక్కడ తెచ్చిందో ఆ యమ్మ ఏభై రూపాయీలు తెచ్చి ఆమె చేతుల్లో పోసింది. మరునాడు మేమిద్దరం పట్టణానికి బయలుదేరాం. ఆయమ్మకు, పాపం, నన్ను విడిచిపెట్టటం కష్టమే అయింది. కళ్ళవెంట నీళ్లు పెట్టుకుంది.

మేము ఆ రాత్రంతా రైల్లో ప్రయాణం చేశాము. తెల్లవారి పదిగంటలకు ఒక పెద్ద స్టేషన్లో దిగాం. నేను అంతకు

ముందు రైలు ప్రయాణం చేసినవాణ్ణి కాదు. ఇంత పెద్ద భవంతీ, ఇంతమంది మనుష్యుల్నీ చూచినవాణ్ణి కాదు. నాకంతా గమ్మత్తుగా, గందరగోళంగా వుంది.

నన్ను తీసుకువచ్చిన పంతులమ్మ గేట్లో వున్నాయనకు టిక్కెట్లు ఇచ్చింది. "ఇక్కడే నుంచో అబ్బాయ్, ఇప్పుడే వస్తాను" అని చెప్పి బయటకు వెళ్ళింది. నేను అక్కడే నుంచున్నాను.

జనం తుకిడీలు తుకిడీలుగా వస్తున్నారు; వెళ్తున్నారు. పక్కన మంచి మంచి బొమ్మలున్న బుక్కులు అమ్మేకొట్టు వుంది. ఎదురుగా వున్న రోడ్డు మీద కార్లూ ట్రాములూ గోలచేసుకుంటూ వెళ్తున్నాయి. వాటిపేరు నాకు అప్పుడు తెలియవు. తరువాత తరువాత తెలిసింది. అప్పుడు మాత్రం నా కళ్ళను నేనే నమ్మలేకుండా చూస్తూ నుంచున్నాను. అట్లా ఎంతసేపు నుంచున్నానో ఏమో! గబుక్కున నన్నక్కడ నుంచో బెట్టి వెళ్ళిన పంతులమ్మ జ్ఞాపకం వచ్చింది. ఆబిడ రాలేదు. ఎంతసేపు నిలబడిచూచినా రాలేదు. కడుపు కొరకొర మంటూ వుంది. రైలెక్కింతర్వాత ఇంతవరకూ నోట్లోకి ఒక్క మెతుకయినా వెళ్ళలేదు. ఆమె ఏవో కొనుక్కు తింది; నాకు మాత్రం పెట్టలేదు.

నాకు ఏడుపు వచ్చింది. బిగ్గరగా ఏడ్చాను. నా ఏడుపుకి నాకే సిగ్గువేసింది. కాని ఏడుపు ఆపలేకపోయాను. చుట్టుపక్కల నిలబడ్డ వాళ్లంతా నన్నే చూస్తూ నిలడ్డారు. ఎవరన్నా దయతలచి పలకరిస్తారేమో అనుకున్నాను. ఎవ్వరూ పలకరించలేదు. కాసేపు నిలబడి చూసేవారు! ఎవ్వరి దారిన

వాళ్లు వెళ్ళేవారు. గేట్లో వుండి టికెట్లు తీసుకుంటున్న మనిషి, "పో ఇక్కడ నుంచి" అని గదమాయించి రెక్క పట్టుకొని ఈడ్చుకువెళ్ళి, రోడ్డు మీదకు తోశాడు. ఎక్కడికి వెళ్ళేటట్టు? ఎటువెళ్ళేటట్టు? రోడ్డెమ్మటే నెమ్మదిగా నడిచాను. పంతులమ్మ ఎక్కడన్నా కనిపిస్తుందేమోనని అటూ ఇటూ చూస్తూ నడిచాను. ఇంతమందిని ఏ నాడూ చూసిఉండక పోవటంమూలాన, నాకళ్ళకి మొగవాళ్లంతా ఒకేమాదిరి గాను, ఆడవాళ్ళంత ఒకేమాదిరిగాను కనిపించారు. రోడ్డుకి అవతలపక్క ఒక ఆడమనిషి కనిపించింది. పంతులమ్మే అనుకున్నాను. ఆ మనిషి చీదరించుకొని, తిడుతూ, నన్ను నెట్టి వేసింది. "మురికిచచ్చినాడా! కళ్లు కనపట్టంలేదట్రా" అని చెంపపగిలేటట్టు కొట్టింది. ఆమె పంతులమ్మ కాదు, ఎవ్వరో! నా కళ్ళు తిరిగినై. చెంపమీద చెయ్యిపెట్టుకొని గోడకు జేరగిలబడి నిలబడ్డాను. ఆమె వెళ్ళిపోయింది.

అప్పుడు నాకు తట్టింది, పంతులమ్మ మోసంచేసి వెళ్ళి పోయిందని. నన్నెక్కడో జేర్పించి చదువు చెప్పిస్తానని చెప్పి, ఆయమ్మ దగ్గర డబ్బు తీసుకొని, నన్ను విరగడ చేసుకొని వెళ్ళిపోయింది. పంతులమ్మ ఎవ్వరో నాకు తెలియదు. ఎక్కడవుంటుందో అసలే తెలియదు. ఏం చెయ్యను? కాళ్ళు ఎక్కడకు తీసుకువెళ్తే అక్కడకు నడిచాను.

పొద్దుగూక వచ్చింది. పొద్దున్నుంచీ పంపుల్లో నీళ్ళు తప్ప కడుపులోకి ఏమీ వెళ్ళలేదు. ఆకలి మండుతోవుంది. కాళ్ళు తప్పుకాళ్ళయినై. పక్కనే ఒక అమ్మి అన్నంపొట్లాలు కట్టి అమ్ముతావుంది. పొట్లం అణా. ఎక్కడిది? "బాబూ

ఆకలి. ఒకపైసా ఇవ్వండి" అని ఇద్దరు ముగ్గురు పెద్దమనుష్యు లను అడిగాను. ఇవ్వలేదు. దగ్గరగా బస్సు ఆగింది. జనం త్రోక్కి-సలాడుతూ ఎక్కుతున్నారు. ఆ జనంలో ఎవ్వరో ఒకరు ఇవ్వకపోతారా - అని అక్కడకు వెళ్ళాను. ఒకరిద్దర్ని అడిగాను. అంటే అడుక్కు-తినడం మొదలుపెట్టానన్నమాట! ఎవ్వరూ దయతలచ లేదు. నాకు దగ్గర్లో బస్సు ఎక్కటానికి ఒక పెద్దమనిషి లాంకోటు వేసుకొని నిలబడి వున్నాడు. ఆయన లాంకోటు జేబులోనుంచి రూపాయి కాగితం పైకి కనుపిస్తా వుంది. ఏంచేస్తున్నానో తెలియకుండా ఆజేబులోకి చెయ్యి పోనిచ్చాను. నన్ను పట్టుకున్నాడు. అక్కడ వున్నవాళ్ళంతా తలోకదెబ్బ వేశారు-"దొంగ ముండాకొడకా!" అన్నారు. దగ్గరవున్న పోలీసుని పిలిచి అతడికి అప్పగించారు.

ఆరాత్రి నేను పోలీస్ స్టేషన్‌లోనే వున్నాను. తెల్లవారి నన్ను గదిలోనుంచి బయటకు తీసి, పెద్ద పోలీసుదగ్గరకు తీసుకువచ్చి నిలబెట్టారు. అక్కడ ఒక దొర వున్నాడు. ఆ దొరకు కొద్దిగా తెలుగు వచ్చు.

"వీడేనా?" అని అడిగాడు.

"అవును, ఈ పిల్లవాడే" అని జవాబు చెప్పాడు పెద్ద పోలీసు.

నన్ను గురించి అంతకు ముందే మాట్లాడుకున్నట్లు న్నారు. నన్ను తన బడికి తీసుకువెళ్ళాడు దొర.

ఆ బడి పట్టణానికి దూరంగా కొండలమధ్య వుంది. ఒక మైలుదూరంలో చిన్న వూరు వుంది. ఆ వూరునుంచి

చదువుకోటానికి పిల్లలు వస్తుంటారు. నావంటి పిల్లలు పది మంది అక్కడే తిని అక్కడే చదువుకుంటూ వున్నారు.

ఆ బడికి నన్ను తీసుకొని వెళ్ళిన దొరే పెద్ద. ఇంకా చిన్నదొరలు ముగ్గురున్నారు. వాళ్ళంతా కలిసి ఈ బడిని నడుపుతున్నారు.

పెద్దదొర పట్టణాన్నుంచి గొప్ప గొప్ప వాళ్ళందర్నీ తీసుకువచ్చి బడిని చూపిస్తూ వుండేవాడు. అప్పుడు దిక్కులేక అక్కడే తిని చదుకుంటున్న మమ్మల్ని పిలిచి, మా సంగతులన్నీ చెప్పమనేవాడు. నేను మా అమ్మ సంగతి చెప్పేటప్పుడు, "ఆమె చెడుగా జీవించేదిలెండి" అనేవాడు పెద్దదొర. నాకు మనస్సులో చాలా కష్టం వేసేది. కష్టం వేస్తేమాత్రం చేసేదేముంది? అట్లాగే నా సంగతంతా వారికి చెప్పేవాణ్ణి. "వీరేగనక నన్ను దయతలచి తీసుకురాకపోతే, దొంగతనాలు అలవాటై ఈపాటికి ఏ జైల్లోనో వుండేవాణ్ణి" అని చెప్పేవాణ్ణి. నేను బస్సు ఎక్కే ఆయన జేబులోనుంచి రూపాయికాగితం ఏ విధంగా దొంగిలించానో చెప్పేవరకూ దొర నన్ను విడిచిపెట్టేవాడు కాదు. మాసంగతులన్నీ చెప్పినతరువాత "ఇటువంటివాళ్ళ ప్రవర్తనను మార్చి మంచివాళ్ళను చెయ్యటానికే ఈబడి పెట్టాం. లేకపోతే వీళ్ళంతా దొంగలూ, తాగుబోతులూ, జూదర్లూ అయ్యేవారు" అని చెప్పేవాడు పెద్దదొర. గొప్పవాళ్ళంతా వాళ్ళకు తోచినట్లు చందాలిచ్చి వెళ్తుండేవాళ్ళు..

ఈమాదిరిగా నా సంగతి చెప్పుకోవలసి వచ్చినప్పుడల్లా కష్టంవేసేది. 'మాఅమ్మ చెడ్డది, చెడుగా బతికేది'

అని చెప్పవలసి వచ్చినప్పుడల్లా కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి. నేను చేసిన దొంగతనాన్ని గురించి చెప్పవలసి వచ్చినప్పుడల్లా గొంతులో ఏదో పట్టు కున్నట్టు అయ్యేది.

కాని మా యాతన పెద్దదొర గుర్తించేవాడు కాదు. ఆయనకు మేము ఎంత చెడువాళ్ళమో, మా అమ్మలూ అయ్యలూ ఎంత చెడువాళ్ళో చెపితేగాని తృప్తిగా వుండేది కాదు. అట్లా చెపితేగాని తను ఎంత మంచిపని చేస్తున్నదీ వచ్చిన గొప్పవాళ్ళకి నచ్చదని ఆయన నమ్మకం. నిజమే కావచ్చు. కాని మా సంగతి? మేము లెక్కలోనివాళ్ళం కాము. మాకంటే మమ్మల్ని బతికించటానికి పోగయ్యే చందాలు గొప్పవి ఆయనకి. ఏ గొప్పవాడు వచ్చినా, ఆ గొప్పవాని ముందు మేము మా సిగ్గును పరచవలసిందే. నేను 'మా అమ్మ చెడుది' అని చెప్పవలసిందే.

అలా చెప్పి ఆ రోజంతా ఏడుస్తూనే వుండేవాణ్ణి. వారం పదిరోజులు నిద్రపట్టేది కాదు, అన్నం సయించేది కాదు. కన్నుమూస్తే అమ్మ కనిపించేది. కళ్ళవెంట నీళ్ళు కారుస్తూ ఎదురుగా నిలబడేది. "నన్ను అమ్ముకొని బ్రతుకు తున్నావా!" అని అడిగినట్లుండేది. అప్పుడు ఈ బతుకు బతికించానికంటే చస్తే ఒచ్చే ఇబ్బంది ఏమిటి–అని అనిపించేది నాకు. బతకటానికి "మాఅమ్మ చెడ్డది. చెడుజీవితం జీవించింది" అని చెప్పుకోటానికి జంకని నేను, పెద్దవాణ్ణయితే చెయ్యని పని అనేది ఏముంటుంది! అట్లా దొర్లిపోయినయి రోజులు.

ఇవ్వాళ పొద్దున్న ఎవ్వరో గొప్పవాళ్ళు వస్తారని తెలిసింది. బడంతా శుభ్రం చేశారు. పిల్లలందరూ స్నానం చేసి, ఉతికిన బట్టలు కట్టుకొని పదిగంటలకల్లా బడిహాల్లో హాజరు కావలసిందని చెప్పారు. ప్రతిరోజూ మేము స్నానం చేస్తే చేసేవాళ్ళం, లేకపోతే లేదు. మాకు రెండుజతల బట్టలువుండేవి. ఒకటి కట్టుకొని ఒకటి వుతుక్కుంటూ వుండేవాళ్ళం. చిరిగితే మేమే అతుకులు వేసి కుట్టుకునేవాళ్ళం. ఎవ్వరో గొప్పవాళ్ళు బడిని చూట్టానికి వచ్చినప్పుడు తప్ప మా సంగతి ఎవ్వరూ పట్టించుకునేవాళ్ళు కారు. ఎవరైనా వచ్చినప్పుడు మాత్రం అంతా సందడే.

పదిగంటలకల్లా మేము హాల్లోకి జేరాం. మేము జేరిన కొద్దిసేపటికే దొరలూ, బడిని చూట్టానికివచ్చిన గొప్పవాళ్లూ వచ్చారు. వాళ్ళల్లో ఒక్క ఆడమనిషికూడా వుంది. బడి సంగతులూ, బడి దిక్కులేనివాళ్ళపట్ల చేస్తున్నపనీ చెప్పి మమ్మల్ని దగ్గరకు పిలిచాడు పెద్దదొర! నా కాళ్ళు వణికినై.

"వీళ్ళందరూ దిక్కులేనివాళ్ళే; చెడు జీవితాలకు అలవాటు పడ్డవాళ్ళే. తానుచేస్తున్న నేరాలకు వాళ్ళను పోలీసువాళ్ళు పట్టుకుంటే మేము తీసుకువచ్చి చదువు చెపుతున్నాం. వీళ్ళ జీవితాలు ఇప్పుడు పూర్తిగా మారిపోయినై. ఇక్కడ జేరకముందు వాళ్ళజీవితాలు ఎట్లా వుండేవో వాళ్ళే చెపుతారు, వినండి" అన్నాడు పెద్దదొర.

గొప్పవాళ్ళంతా చెవులు రిక్కించి వింటున్నారు. నేను ఆడమనిషివంక చూశాను. ఆమె చీరె సర్దుకొని కూచుంది—మా చెడుబతుకులు వింటానికి. ఒక్కొక్కరూ

చెపుతున్నారు. మధ్యమధ్య 'అయ్యో' 'పాపం' అని అంటూ వున్నారు గొప్పవాళ్ళు. నా వంతు వచ్చింది.

"ఈ పిల్లవాడి బ్రతుకు మీరు వినదగింది చెప్పూ" అన్నాడు పెద్దదొర.

నేను మెదలకుండా నుంచున్నాను.

"చెప్పు అబ్బాయ్" అంది ఆడమనిషి.

"తనజీవితం తలచుకుంటేనే ఏడుపు వస్తున్నట్టున్నది, పాపం... చూశారా, ఎట్లా కళ్ళవెంట నీళ్లు పెట్టుకుంటు న్నాడో?" అన్నారు ఒకరు.

"ఈ పిల్లవాని తల్లి చెడ్డది. తండ్రి చెడ్డవాడు. బ్రతికి నన్నాళ్ళూ చెడుగా బ్రతికి చచ్చిపోయారు. ఈ పిల్లవాడు కూడా తలిదండ్రులకు మల్లేనే చెడుగా బ్రతకటం మొదలు పెట్టాడు. మేము రక్షించి తీసుకున్నాం" అన్నాడు పెద్దదొర.

"పాపం" అన్నారు అంతా.

"చెప్పబ్బాయి నీ సంగతి" అంది ఆడమనిషి.

"నేను చెప్పను" అన్నాను.

"ఊ! చెప్పూ" అన్నాడు పెద్దదొర.

"నేను చెప్పను" అన్నాను. వీళ్ళ అమ్మల సంగతి వీళ్ళ అయ్యల సంగతివీళ్ళెందుకు చెప్పుకోరు, అనుకున్నాను. చెప్పుకుంటే బాగుండును అనిపించింది, వినాలనిపించింది.

ఆ ఆడమనిషి నన్ను దగ్గరకుతీసి, "చెప్పు అబ్బాయి" అన్నది. నాకు ఆవిడచేతులు చల్లగా తగిలినై, మా అమ్మ

జ్ఞాపకం వచ్చింది. ఇక అక్కడ నిలవలేకపోయాను. పెల్లుబికి వస్తున్న ఏడుపును బిగపట్టుకొని గదిలోకి పరిగెత్తాను.

గదిలోకి వచ్చిన పిల్లలు వెళ్ళిపొయ్యారు. ఇక నేనే ఆ గదిలో వుంది. పిల్లలు చెప్పిన మాట నిజమే! ఇక పెద్ద దొర నన్నీబడిలో వుండనివ్వడు. నేను బజారు కెక్కవలసిందే. ఎక్కుతాను, తప్పేది ఏముంది? అడుక్కు తినవలసిందే; తింటాను. తప్పేదివేముంది? జేబులు కొట్టవలసిందే. కొడతాను. తప్పేది ఏముంది? అప్పుడు నాకు తెలిసివచ్చింది- మా అయ్యలో ఏమన్నా చెడూ మా అమ్మలో ఏమన్నా చెడూ వుంటే దానికి కారణం ఎవ్వరో! కారణం వీళ్లే— ఇటువంటివాళ్ళే.